క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మలక్‌పేట: సామాజిక బాధ్యతగా భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మలక్‌పేట సెయింట్ జేవీయర్స్ హైస్కూల్ కరస్పాండెంట్ జి. హిజ్కియా అన్నారు. మొక్కలు పెంపకంపై బుధవారం ప్రొఫెసర్స్‌కాలనీ, ఆనంద్‌నగర్‌ల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలన్నారు.

ఇంటింటికి జ్వర సర్వే



జ్వర సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

చాదర్‌ఘాట్: వర్షాకాలంలో వ్యాధులు విజృంభిస్తుండటంతో జ్వర సర్వే నిర్వహిస్తున్నారు. మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, సైదాబాద్, అక్బర్‌బాగ్ డివిజన్‌లలో ఉన్న 4 యూపీహెచ్‌సీలతో పాటు బస్తీ దవాఖానాల పరిధిలో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. జ్వర బాధితులు ఉంటే వెంటనే మందులు అందిస్తున్నారు.

కాలనీలో పర్యటన

ఎల్‌బీనగర్: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు.కాలనీలో సమస్యలు పరిశీలించాలని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఆయన గౌతమినగర్ కాలనీలో పర్యటించి నూతన ఓపెన్ జిమ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, కిషన్, నారాయణరావు, రాజ పాల్గొన్నారు.

సెల్లార్ సీజ్



సైదాబాద్: నిందనలకు విరుద్ధంగా తవ్విన సెల్లార్‌ను అధికారులు సీజ్ చేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ చౌరస్తాలో భవన నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి స్టిల్ట్ ప్లస్ టు అనుమతులు పొందిన బిల్డర్ అనుమతులకు విరుద్ధంగా భారీ సెల్లార్ తవ్వారు. ఈ సెల్లార్‌తో పరిసర గృహాల వారికి ప్రమాదం కలిగే అవకాశాలు ఉన్నాయని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ పలుమార్లు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేయగా బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు వచ్చి అక్రమంగా తవ్విన సెల్లార్‌ను సీజ్ చేసారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

నాగోలు: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఎల్‌బీనగర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా జర్నీ శ్రీనివాస్‌కురుమ, కార్యదర్శిగా మొలకలపల్లి కుమార్‌ను నియమిస్తూ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులు వేముగంటి సంపత్ బుధవారం ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, వినయ్, జగన్, రామకృష్ణ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.31, వంకాయ రూ.28, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.28, మునగ రూ.80, కందగడ్డ రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.40, బీన్స్ రూ.80, క్యాప్సికమ్ రూ.61. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నడిరోడ్డుపై
మృత్యుకుహరాలు

- ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- మరమ్మతు చేయాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: మ్యాన్‌హోళ్లు ప్రజల పాలిట మృత్యుకుహారాలుగా మారుతున్నాయి. కురుస్తున్న భారీ వర్షాలకు సరైన డ్రేనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపైనే పొంగిపొర్లుతుంది. మలక్‌పేట్ జోన్ పరిధిలోని కాలనీల ప్రజలు వర్షాకాలంలో బయట అడుగు పెట్టాలంటేనే జంకాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ మ్యాన్‌హోల్ బలి తీసుకుంటుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తప్పటడుగులు వేయాల్సి వస్తుంది.జోన్ పరిధిలోని కాలనీలు, ప్రధాన రహదారులపై గత కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోక ప్రమాదకరంగా మారాయి. ప్రతి సంవత్సరం ఎంతోమంది మూతల్లేని మ్యాన్‌హోళ్ల కారణంతో మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే.

ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు..

ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ, శంకర్‌నగర్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, సింగరేణికాలనీ, మాదన్నపేట్, అజంపుర, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాలలో చాలా చోట్ల మూతల్లేని మ్యాన్‌హోళ్లు దర్శనం ఇస్తున్నాయి. దీనికి తోడు ఎవరి ఇష్టానుసారం వారు రోడ్ల తవ్వకాలు చేపడుతుండటంతో వాటర్, డ్రేనేజీ మ్యాన్‌హోళ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రోడ్డుకి సమాంతరంగా ఉండాల్సిన మ్యాన్‌హోళ్లు ఎత్తుగా ఉండటంతో వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రతి సంవత్సరం అమాయక ప్రజల ప్రాణాలు బలవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక..

ఆర్‌కేపురం డివిజన్, అజంపుర, సైదాబాద్, కుర్మగూడ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోళ్లు అధికంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి వారం డ్రేనేజీలో పేరుకుపోయే మట్టిని తొలగించకపోవడం వల్ల భారీ వర్షాలకు మ్యాన్‌హోళ్లు దెబ్బతింటున్నాయి. పొగిపొర్లే మురుగునీటి ధాటికి తట్టుకోలేక మ్యాన్‌హోళ్ల మూతలు వరదనీటిలో కొట్టుకుపోతున్నాయి. సరైన డ్రేనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం ప్రజలకు ప్రాణ సంకటంగా మారుతుంది. ఎప్పటికప్పుడు నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఆఫీసులకే పరిమితం అవుతున్నారు. ఫలితంగా వర్షాకాలంలో ఇంటినుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి క్షేమంగా చేరుతాడనే భరోసా లేకుండా పోతుందని పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



ఎన్‌టీఆర్‌నగర్ మెయిన్ రోడ్డు రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలి



మాట్లాడుతున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ వాణినగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రైతుల రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్‌తో యువతకు ఉద్యోగాలు, సన్న బియ్యం పంపిణీ తదితర ప్రభుత్వ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. అదే విధంగా ఈనెల 4న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిధిగా హాజరవుతున్న కాంగ్రెస్ బహిరంగ సభకు సైదాబాద్, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్ డివిజన్ల నుంచి భారీ సంఖ్యల్లో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో నాగరిగారి దాస్, గని, కోట్ల లడ్డూపటేల్, రమేష్ నాయక్, ఫిరోజ్‌ఖాన్, మహ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మార్కెట్‌లలో ఖాళీలను భర్తీ చేయాలి

చాదర్‌ఘాట్: మార్కెట్‌లలో వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసి ఉద్యోగులకు పని భారం తగ్గించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కోరారు. బుధవారం టీఎన్‌జీఓఎస్ ప్రతినిధులతో కలిసి ఆయన సీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నందుకు వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎస్‌ను కలిసిన వారిలో టీఎన్‌జీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, వెంకటేశ్వర్లు, ముక్రం ఉన్నారు.



సీఎస్ రామకృష్ణారావును కలిసిన టీఎన్‌జీఓఎస్ ప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి కృషి



శంకుస్థాపనలో కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కాలనీలో సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ శ్రీ శంకర్ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ పనులకు బుధవారం అయన కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్రీ శంకర్ కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాలనీ అధ్యక్షుడు కృష్ణ, రమేష్ చారి, విద్య సాగర్, నాగేశ్వర్ రావు, రమేష్, భాస్కర్, సంగీత పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో నుంచి పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు ప్రత్యేక బస్సుల సర్వీసులు నడిపిస్తున్నట్లు మేనేజర్ సమత తెలిపారు. వరంగల్, కొమురవెల్లి, కొండపోచమ్మ, వేములవాడ దేవాలయం వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. శనివారం ఉదయం 5 గంటలకు బయలుదేరి యాత్ర అనంతరం సాయంత్రం 7 గంటల వరకు తిరిగి డిపోకు చేరుకుంటుందన్నారు. ఇతర వివరాలకు 7989928321, 9063102132 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చినుకులకే రోడ్లు ఛిద్రం

వనస్థలిపురం: గత రెండు రోజులుగా కురిసిన ఓ మోస్తారు వర్షాలకే వనస్థలిపురం డివిజన్ పరిధిలో పలు ప్రాంతాలతో రోడ్లు ధ్వంసమయ్యాయి. పలు లోతట్టు కాలనీల్లో వరదనీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. డివిజన్ పరిధిలో సోమవారం సాయంత్రం, మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో రోడ్లు కోసుకుపోయి గుంతలమయంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే భారీ వర్షాలు పడితే మా పరిస్థితి ఏంటని ఆయా ప్రాంతాల వారు ఆందోళనకు గురవుతున్నారు.



సాగర్ హైవే నుంచి వెంకటరమణ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీ ప్రధాన రోడ్డులో నిలిచిన వరదనీరు

డిప్యూటీ ఐఓఎస్‌గా వెంకట్‌రెడ్డి



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మలక్‌పేట: సైదాబాద్–2 డిప్యూటీ ఐఓఎస్‌గా పి. వెంకట్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మలక్‌పేట హైస్కూల్‌లో పీఆర్‌టీయూ టీఎస్ సైదాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డిప్యూటీ ఐఓఎస్‌కు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, జిల్లా బాధ్యులు ప్రశాంత్‌రెడ్డి, మండడి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సాంబశివరావు సతీష్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ విభాగాల ఆధ్వర్యంలో 4100మందితో మన్సూన్ బృందాలు అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి రోజు మూడు షిఫ్ట్‌లలో పని చేస్తారనివీరితో పాటు హైడ్రా, డీఆర్‌ఎఫ్ బృందాలతో పాటు 21 ఎమర్జెన్సీ బృందాలు 42 మందితో అందుబాటులో ఉంటారన్నారు. వర్షాకాలంలో ఎలాంటి సమస్యలున్నా 9000113667 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం



టి.మహేశ్

హస్తినాపురం: ప్రజలను ఇబ్బందులు, భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్స్పెక్టర్ తోట మహేశ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో 12 మంది రౌడీ షీటర్లు ఉన్నారని వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టామన్నారు. ఇటీవల ఓ వ్యక్తిని కత్తితో పొడిచిన రాజుగౌడ్ పై త్వరలోనే రౌడీషీట్ తెరుస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అల్లరిమూకలకు ఇది ఒక గుణపాఠంగా ఉంటుందన్నారు.



బల్కంపేటలోని ఎల్లమ్మ తల్లికి సైదాబాద్‌కు చెందిన ఆనంద్ గురుజీ బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.

సాక్షి,సిటీబ్యూరో

వైద్యులు దైవంతో సమానం

దిల్‌సుఖ్‌నగర్: వైద్యులు దైవంతో సమానమని ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లయన్ డాక్టర్ ఎస్.రామచంద్రరావు పేర్కొన్నారు. ఎస్.ఆర్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యులకు వైద్యరత్న అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ ఎస్.రామచంద్ర రావు, డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ.. ఈ సమాజంలో పూర్వకాలం నుంచి వైద్యులకు ఎంతో పేరు ప్రాఖ్యాతలు ఉన్నాయన్నారు. అనంతరం వైద్యరత్న అవార్డు గ్రహీతలు డాక్టర్ జె.ప్రదీప్ కుమార్, డాక్టర్ షరీఫ్ ఖాన్షా, డాక్టర్ కొండపల్లి అపర్ణ, డాక్టర్ నవీన్ సింగ్ ఠాకూర్‌ను మొమెంటో, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ డాక్టర్ ఎస్.పి. భారతి, విశ్రాంత డిప్యూటి రిజిస్ట్రార్ ఎస్.వేణుగోపాల శర్మ, లాయర్ డాక్టర్ ఆమంచ అంజయ్య, రచయిత్రి డాక్టర్ రాధ కుసుమ, నిర్వాహకులు కె.మురళీమోహన్ రాజు, డాక్టర్ బి.గంగాధర్ రెడ్డి, వి.వి.మహేశ్వరరావు పాల్గొన్నారు.



డాక్టర్‌లను సన్మానిస్తున్న దృశ్యం

సింగరేణి కాలనీలో కార్డన్ సెర్చ్

- 56 వాహనాలు సీజ్

సైదాబాద్: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ సోదాలు నిర్వహిస్తున్నామని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ తెలిపారు. బుధవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ శ్రీకాంత్, ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జోన్ పరిధిలోని 14 మంది ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్‌ఐలు, 230 మంది సిబ్బంది తనిఖీలు చేశారు. అనంతరం డీసీపీ వివరాలు వెల్లడించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రాన్ని సీజ్ చేసి పరికరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ చైతన్య కుమార్

సైదాబాద్ పీఎస్ పరిధిలో మూడు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న ఓ హత్య కేసు నిందితుడి అరెస్ట్ చేశారు. ఓ వ్యక్తి నుంచి 10 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అనుమానాస్పదంగా ఉన్న 26 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

శిశు మందిర్‌కు రూ. లక్ష విరాళం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

చంపల్‌గూడ: నేటి పోటీతత్వ సమాజంలో అందరికీ విద్య అవసరమని భారత్ వికాస్ పరిషత్ సభ్యుడు, ఎన్ఆర్ఐ పార్థసారథి అన్నారు. బుధవారం ఆయన కుర్మగూడ డివిజన్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు వచ్చి పాఠశాల నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందించి విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ఇబ్బందులు ఉన్నా పిల్లలను బడికి పంపాలన్నారు. పరిషత్ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం స్వాతి, సభ్యులు నారాయణ, రాకేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు రక్షణ కల్పించాలి

నాగోలు: ఉప్పల్ మండల పరిధిలోని నాగోలు, బండ్లగూడ, ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలలకు రక్షణ కల్పించాలని ఆయా పాఠశాలల నిర్వాహకులు బుధవారం నాగోలు సీఐ సూర్యనాయక్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అనేకమంది అసాంఘిక శక్తులు, పాఠశాలలకు వచ్చి డబ్బుల గురించి వేధిస్తున్నారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ చెందిన వివిధ కుల కులాలకు సంబంధించిన, విద్యార్థినాయకులు పాఠశాలకు వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వినతి ఇచ్చిన వారిలో వెంకటేశ్వరరాజు, శ్రీధర్, కిరణ్ కుమార్ రెడ్డి, రామ నరసయ్య, రామిరెడ్డి, సోమశేఖర్ గౌడ్, వెంకన్న గౌడ్, బుచ్చిరెడ్డి, శివకుమార్, కబీర, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



సీఐ సూర్యనాయక్ ఫిర్యాదు చేస్తున్న పాఠశాలల నిర్వాహకులు

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



సభ స్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం మండల కేంద్రంలో మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తయారీ పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్ హాజరవుతున్నారని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పరిశ్రమ వద్ద ఏర్పాటు చేస్తున్న సీఎం సభా వేదికను ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు పోలీసులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నేనావత్ రాజునాయక్, ఎడ్మ మోహన్‌రెడ్డి, లాజర్, మద్ది కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణ, నడికూడ శివ పలువురు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

మీర్‌పేట: పదవీ విరమణ పొందిన మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌ను బుధవారం ఆయన నివాసంలో కార్పొరేషన్–1 బీజేపీ అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కమిషనర్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ముఖేష్‌ముదిరాజ్, కీసర గోవర్ధన్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, సోమేశ్వర్, భీంరాజ్, విక్కీసాగర్ పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా

లక్డీకాపూల్: జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో చాంపియనషిప్ పోటీల్లో లా కాలేజీ విద్యార్థి సత్తా చాటాడు. ఇటీవల ఉత్తరాఖండ్‌కు చెందిన హరిద్వార్ వందన కటారియ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో మార్వాడీ శిక్షా సమితి(ఎమ్.ఎస్.ఎస్) లా కాలేజీ విద్యార్థి రాజు రాథోడ్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా రాజు రాథోడ్‌ను చాదర్‌ఘాట్‌కు చెందిన కాలేజీ యాజమాన్య సభ్యులు కమల్ నారాయణ్ అగర్వాల్, సి.ఎ. ఎస్.బి. కాబ్రా, శైలేష్ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఆదిల్ ఘనంగా సన్మానించారు.

